
# శాశ్వతమైన క్షణం

టి. వెంకట్రావు



విశాఖపట్నం రైల్వే స్టేషను నుండి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతున్నది.

హడావుడిగా రైలు ఎక్కాను. బండిలో బాగా రద్దీగా వుంది.

చాలామంది సీట్లు దొరకక నిలుచునే వున్నారు. కాస్త లోపలికిపోతే ఖాళీ దొరుకుతుందేమోనని జనాన్ని తప్పుకుంటూ కొంత లోనికి నెట్టుకు వెళ్ళాను.

సీటు లేవుగాని యెవర్నీ అనుకోకుండా నిలుచోడానికి బాగుంది. ఒకటి రెండు స్టేషనులు దాటేసరికి సీటు దొరుకుతుందిలే అని మనస్సును స్థిమిత పర్చుకున్నాను విజయవాడ వరకూ ప్రయాణం చెయ్యాలి మరి

చుట్టూ కలియజూశాను. ఆ లైటు కాంతిలో వెలుగునీడల్లో వివిధ ఆకారాలు కనిపించాయి. బండి ఊపుకు అప్పుడే కొందరు కునుకు తీస్తున్నారు. పెద్దవారూ, ముసలివారూ యేదోఒక దానికి లేదా ప్రక్కమనిషికి చేరబడిపోయారు. పిల్లలు మరిన్నూ. ఎలాబడితే అలా నిదురపోయున్నారు. యువజనులు మాత్రం నిదురపోరుకదా. వారి మనసుల్లో యెప్పుడూ కుతూహలం, ఉత్సాహం నిండివుండటం చేతనేమో, నేనెలా తేరిపార చూస్తున్నానో అలాగే కూర్చునివున్న ఒక యువతి అందర్నీ తేరిపార చూస్తోంది.

నామీదా ఆమె దృష్టి పడింది. నన్నూ ఏవిధ ఆకర్షించింది. అనుకోకుండా నా కళ్ళు ఆమెను రెండు క్షణాలు అధికంగా చూశాయి. ఆమె చూపును కాస్త తీక్షణం చేసి తల వంచుకుంది. ఆమె కనుబొమలు

చిట్లించుకొని చూడటం యెలా వుందంటే "ఈ మగాళ్ళింతే" అన్నట్టుంది. ఆమె ప్రక్కన వాళ్ళమ్మో, అత్తో ఒక ముసలమ్మ కునుకుతూ, వుండుండి మేలుకుని తన అమ్మాయికి కావలా వున్నట్టు నటిస్తూ సెంట్రీ కాస్తుంది, ఆమెకు ఆ ముసలామె బాడీగార్డుగావాలి.

ఇంతలో అనకాపల్లి వచ్చింది ఆమె ప్రక్కన కూర్చున్న ముసలాయన తటాలున లేచి గభాలున దిగి వెళ్ళిపోయాడు ఆ స్థలంలో నేను కూచోబోయాను. ఆమె బెదురుచూపులు చూస్తుంది. ఆమె సెంట్రీ లేచింది. ఆ ముసలామె నన్ను ఆగమన్నట్టు అరచెయ్యి చూపిస్తూ, ఎదుటి బెంచీమీద వున్న ఒక మధ్యవయస్కురాలయిన అమ్మాయిని పిలిచి ఆ కాళీ స్థలంలో కూచోబెట్టుకుంది. రక్షించబడినట్టుగా ఫీలయినట్టుంది ఆ యువతి.

ఆమె యెదురు బెంచీమీద నెమ్మదిగా కూర్చున్నాను ఆ బెంచీమీద కునుకుతున్న వారెవరూ నన్ను ఆపలేదు. దర్జాగా దాని మీద స్థిరపడ్డాను

మరల నా దృష్టి ఆమె మీద పడింది. ఆమె కూడా నన్ను అప్పుడప్పుడూ చూస్తూ మరల చూపును ప్రక్కలకు మరల్చుకుంటున్నది. ఆ బెదురు చూపులు యెందుకలా చూడటం. నిదురపోకూడదూ అని ప్రశ్నించుకున్నాను. బహుశా మెడలో నగలున్నాయేమో! మరల ఆమెను పరిశీలించాను. ఆమె వయసు పాతికేళ్ళుండవచ్చు అందంగానేవుంది. తెలుపురంగు. పొట్టిగా ఒకమోస్తరు లావుగా - విందుగా వుంది అందమైన తెలుగు పడుచు అనుకున్నాను ఎవ్వారో మరి. నుదుట కుంకుమబొట్టు దాని క్రింద మరల తెల్లని బొట్టు. గోదావరీ ప్రాంతపు యువతి అనిపించింది చిన్న ముక్కు, చిన్న నోరు, గుండ్రటి మోము. తీక్షణమైన చూపులతో పెద్దకళ్ళు.

సైజూ, వయసూ. నా భార్యకు మల్లేనే వుందిగాని ఆమె దొక అందం. ఈమె దొకరకం. ఈమెకు నా భార్య ఏమీ తీసిపోదు ఎందుకులే అధికంగా చూడటం అసలే బెదురుతుంది అనుకుని చూపులను తగ్గించాను.

అయినా ఈవిడ కెందుకూ భయం ఆవిడేమన్నా నగలవీ కలిగిన ధనవంతురాలా? ఆమెకు బాడీగార్డులాగా వుండి సెంట్రీ కాస్తున్న ముసలమ్మ పేదరాలులాగానేవుంది. కాని ఆమె ఆ ముసలామెని పనిమనిషిలాగా చూడటంలేదు. అమ్మో, అత్తో అయివుండాలి. ఆ యువతి చెవులకు దుద్దు లున్నాయి. మెడలో యేమున్నాయో కనబడకుండా పైటను కప్పేసుకుంది.

సంప్రదాయ మాధుర్యం

## మందార మకరందాలు

శ్లో॥ మనీషిణస్సంతి నతే హితైషిణో।
హితైషిణస్సంతి నతేమనీషిణః।
సుహృచ్చ విద్వానపి దుర్లభో నృణాం।
యథౌషధం స్వాదు హితంచ దుర్లభం॥

పండితులు యెందరో వుంటారుకాని. వారు మేలు కోరేవారు కారు. మేలు కోరేవారు వుంటారుకానీ, వారు పండితులూకారు; తీయగా వుండీ. పథ్యమైన ఔషధం దొరికినట్టు. మేలు కోరేవాడయి పండితుడు కూడా అయినవాడు అప్పుడు కావడం అరుదుగదా!

చేతులకు రంగు రంగుల గాజులున్నాయి. పాదాలమీద పట్టీ లున్నాయి. ప్లాస్టిక్ చెప్పులుకూడా వున్నాయి. ఆమె కాళ్ళ వెనకాలె ఒక సూట్‌కేస్‌వుంది. ఆమె మధ్యతరగతి కుటుంబానికి చెంది వుండాలి. లేదా లోయర్ మిడిల్ క్లాసుకు చెంది వుండాలి. లేదా అప్పర్ లోయర్‌క్లాసు అయి వుండాలి అని అంచనాలు వేస్తున్నాను.

ఆమె బెదురు చూపులవీ చూస్తుంటే ఆమెలో యేమీ గడుసుతనం లేనట్టేవుంది. బహుశా ఆవిడ వయసు యిరవయ్యే అయి వుంటుంది అని నా మొదటి అంచనాని సవరించాను. ఇరవయ్యేళ్ళంటే తక్కువా. పెళ్ళయే వుంటుంది. కన్నవారింటికెళ్తుందో లేక అత్తవారింటికెళ్తుందో. ఇది అక్టోబరు నెల దగ్గరలో యేమీ పండుగలు




లంచం యివ్వాలనుకొంటే నా ద్వారా యివ్వచ్చు మీ పన్లు జరిగిపోతాయి.

కూడా లేవు. ఆమెను చూస్తే గర్భిణీ లక్షణాలూ లేవు. యేమి పనిమీద వెళ్తుందో మరి?

మొత్తంమీద సాంసారికమైన ఆడది లాగానే వుంది. అనవసరంగా నావైపు బెదురు చూపులు చూస్తుంది. నేనేమి రౌడీలాగ లేనుకదా. షోకిల్లానూ కాదు. యెందుకలా చూస్తుందో. పోనీ నిదురపోదే. అయినా నాకెందుకు ఆవిడ వూసు. ఇద్దరు పిల్లలున్న వెధవని. ఆవిడని అట్టే చూడటం మరీ బాగాలేదని నన్ను నేనే ఆత్మవిమర్శన చేసుకుంటున్నాను. కునుకుదామని ప్రయత్నించాను. నాకు నిద్రరాదు. వెనుక బెంచీలో కూచుని నిద్రపోవడం విద్యార్థి గళలో నేర్చుకోకపోవడం యెంత పొరపాటైపోయిందీ!

ఇంతలో మరొక స్టేషను వచ్చింది. ఆమె ప్రక్కనున్న నడిమి వయస్సామె కూడా బండి దిగి వెళ్ళిపోయింది. ఆ చోటులో ఒక నడివయసు సాహెబుగారు వచ్చి ఏమాత్రం ఆలోచించకుండా కూచున్నాడు ఇంకావిడ యేమీ చెయ్యలేకపోయింది. ఆమె సెంట్రీకి మెలకువ రాలేదు. కాసేపటిలో ఆ పెద్దమనిషి కునుకుతున్నాడు. తూలుతున్నాడు. వెనక్కి కొంతసేపు, ముందుకు కొంతసేపు చేరబడుతున్నాడు. అతని నిద్ర ముదిరిపోయింది. ఆమెమీద ఒరబడిపోయాడు. ఆమె విదిలించుకుంది. లేచి సర్దుకుని మరల కునుకుతున్నాడు

ఆమె దీనావస్థని నేను సానుభూతిగా పరిశీలిస్తున్నాను. ఆమె ఏదో పొరపాటు చేసినట్టుగా నావైపు చూస్తున్నదీ "ఈ ముసలాడికంటేఅల్లరాడినైనా ప్రక్కన కూచోనిస్తే

పోను అనుకుంటుందేమో! ఆ పెద్దమనిషి బెడద యెలా తొలగించడమా అని నేను కుట్రపన్నడం మొదలెట్టాను.

ఇంతలో మరో స్టేషన్ వచ్చింది నా బెంచీమీదనుంచి యెవరో బైటికిపోయారు. వెంటనే ఆ పెద్దమనిషిని లేపి ఈ బెంచీ మీదికి రమ్మని అడిగాను. పాపం ఆ పెద్దమనిషి. తిరుగుబాటుచేయకుండా పెద్దమనిషనిపించుకున్నాడు వచ్చి నా బెంచీ మీద కూచుని మరల నిద్రలోకి జారిపోయాడు. ఆవిడ చూపులలో యిప్పుడు తీక్షణత తగ్గింది. నాపై కొద్దిగా మంచి అభిప్రాయం యేర్పడినట్లుంది. ఇప్పుడామె ప్రశాంతంగా, ఎక్కువ సేపు చూస్తున్నది నావైపు. ఇంకెవరికీ చోటులేనట్టుగా తనప్రక్కనున్న ఖాళీలోకి సర్దుకుని కూచుంది. మరల నావైపు చూస్తుంది.

ఎందుకలా చూస్తుంది? ఇప్పుడు నే నామెకు యేమి మేలు చేశానని? ఇందాక తీక్షణంగా చూసింది. అప్పుడేమి హాని చెయ్యలేదు. అక్కడ కూచోబోయాను అంతే. ఇంతలోనే యెంత మార్పు. ఆ పెద్దమనిషి బెడదనుంచి రక్షించానని కృతజ్ఞత కాబోలు.

కళ్ళు మూసుకుని చూశాను. వెధవ నిద్దర ఎంతకీరాదు, కళ్ళు తెరిస్తే యెదురుగా ఆమె. రెప్పార్పకుండా చూస్తుంది. ఎందుకలా చూస్తుంది? నన్ను అభిమానిస్తుందా ప్రేమిస్తుందా, ఏం. వాళ్ళాయనకంటే బాగున్నానా? అబ్బే నేనేమీ అందగాణ్ణి కాదే. వాళ్ళాయన బలహీనుడా? యేమో నాకంటే బలహీనంగా వుంటారేమో. లేకపోతే తాగుబోతో. కొడతాడో యే రకంవాడో. ఈమెకు పిల్లలుండి వుంటారే! ఇప్పుడు మరొకడిని ప్రేమించడం మంచిది కాదే. ఎందుకలా చూస్తుంది. మగవాళ్ళను వేటాడే ఆడది కాదుకదా? ఆమె ప్రవర్తన అలాలేదే ఆమె అతిగా షోకులేమీ చేసుకోలేదు. గులాబి రంగు పూలుగల వాయిల్‌చీర కట్టుకుని వుంది. ఎర్రని, పచ్చని గాజులు వేసుకుంది. పెదవులకు యేమీ రంగులేదు. తల సాదాగా జడ వేసుకుంది. కళ్ళకు సాదాగా కాటుక పెట్టుకుంది, గులాబిరంగు ప్లాస్టిక చెప్పులేసుకుంది. అవీ సాదావే. ఎమంత యెక్కువ ఖరీదు వుండవు.

ఆమెనుచూస్తే ఆమె కుటుంబానికి ఆర్థిక పరిస్థితుల లోపమేమీ వున్నట్టులేదు కొద్దిగ లావుగా. ఆరోగ్యంగానే వుంది. కాబట్టి వాళ్ళాయనేదో చిన్న వుద్యోగి అయి వుండాలి. మెడలో కూడా యేవో నగలున్నట్లున్నాయి కనబడనివ్వదు.

ఇందాకటంత ముడుచుకుని కూచోడం లేదు శుభ్రంగా పొందికగా మంచితనం వుట్టిపడేట్లుగా కూచుంది. ఆమెను నిద్రగాని చలిగాని యేమీ తాకటంలేదనిపిస్తుంది.

అయినా ఆవిడవంక అదేపనిగా చూడటం నాకూ ఏమంత బాగాలేదు. నా మంచి భార్య, ఇద్దరు పిల్లలూ జ్ఞాపకం వచ్చారు పిల్లలకోసం విశాఖ స్టేషనులో కొన్న మామిడితాండ్ర బేగ్‌లో బాగా వుందా నలిగిపోయిందా అని చూసుకున్నాను, నా భార్య కోసం కొన్న ఏటికొప్పాక లక్క బొమ్మలు కూడా భద్రంగా వున్నాయి.

ఇంతలో సామర్లకోట వచ్చింది. రైలు ఆగింది ఆమె లేచింది దిగివెళ్ళిపోతారేమో అనుకున్నాను. లేదు ఆమె ప్రక్కనున్న సెంట్రీ మామ్మను కూడా లేపింది. కిటికీ దగ్గర కెళ్ళింది. "చాయ్ గరమ్. చాయ్ గరమ్" అంటూ వస్తున్న కుర్రవాణ్ణి ఆపి రెండు టీలు తీసుకుంది. నాకూ టీ తాగాలనిపించింది. లేచివెళ్ళి నేనొక టీ తీసుకున్నా. టీ తాగుతున్నారు. అయితే వీళ్ళు టానోళ్ళే నన్నమాట అనుకున్నాను.

బండి కదిలింది. ఎక్స్‌ప్రెస్ పరుగు అందుకుంది కంపార్టుమెంటంతా ప్రశాంతంగా వూగుతూంది. నిద్రకు తగిన మ్యూజిక్ యిస్తూ ఇంచుమించు అందర్నీ హిప్నటిజం ప్రయోగించినట్టుగా నిద్రలో ముంచింది. మేమిద్దరమే ఆ శైలి హిప్నటిజానికి అతీతులం.

ఆవిడ నన్నే చూస్తోంది. కళ్ళార్పకుండా చూస్తోంది. నేనూ ఆవిడను చూస్తున్నాను ఆవిడే నన్ను గెలిచిందికాబోలు. ఆవిడవైపు చూడకుండా వుండలేకపోతున్నాను. నేను ఆవిడవైపు చూస్తూవుండగా తన పైటచెంగును భుజంమీద నుంచి తీసి ఒడిలో రెండు సెకనులు పెట్టుకొని తాను నెక్‌లెస్ సర్దుకుంటున్నట్టుగా సరిచేసుకుని ఆ పైటను భుజంమీద వేసుకుంది. ఆవిడ తన అంగ సౌష్ఠవ ప్రదర్శన చేసిందని అర్థం చేసుకున్నాను.

అదేపనిగా చూసుకుంటున్నాయి మా కళ్ళు. మా మొఖాలలో మరే హావభావాలూ లేవు. ఏ సైగలూ లేవు. ఏ వెక్కిరింతలూ లేవు. కనీసం చిరునవ్వులూ లేవు. కొత్తదనం లేకుండా యెంతో పరిచయమున్న జంటలాగా చూసుకుంటున్నాం.

చూస్తున్నానేగాని అనేక ఆలోచనలు పరిగెడుతున్నాయి. ఆవిడేమి కోరుతుంది నేనేం చెయ్యాలి. ఇంతమంది జనంలో ఆమెతో మాట్లాడటం బాగోదు ఎవరైనా మేలుకుంటే అల్లరైపోతుంది నిశ్చేష్టుడనై అలాగే వుండిపోయాను. ఆమెదేవూరో. ఏ పేరో. ఏమనుకుంటుందో అన్నీ ప్రశ్నలే.

ఇంతలో బండి ఆగిపోయింది. ఇక్కడేం స్టేషను లేనట్లుందే యెందుకాగిపోయింది బండీ అనుకుంటున్నాను.

"ఇదే వూరండీ"అని ఆమె అడిగింది. అరె ఆమె నోటినుంచి మాటకూడా వచ్చిందే. తేరుకుని కిటికీలోంచి బయట చీకటిలోవున్న చిన్న స్టేషను సైన్‌బోర్డు వెదకి "గొల్లపాలెం" అన్నాను. మరల ఆవిడ "వచ్చేదీ మావూరే" అన్నది. కాసేపాగి మరల "మాది రాజమండ్రి" అన్నది.

ఆవిడ మాట్లాడుతుందని వూహించలేదు. మాట్లాడేసింది. నిర్ఘాంతపోయాను. మరల మౌనం వహించింది ఈ అవకాశం తీసుకొని నేనేమి మాటలాడకుండా వుండిపోయినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

ఆమె ఈ వచ్చే స్టేషనులోనే దిగిపోతుందన్నమాట. మేం విడిపోతామన్నమాట. ఇపుడేం చెయ్యడం? నేను విజయవాడకు టికెట్ తీసుకున్నాను. రాజమండ్రిలో దిగిపోతే దిగిపోయి ఆమెతో మాట్లాడుకుని మరల విజయవాడకు వెళ్ళాలంటే నా జేబులోని డబ్బులు చాలవు అవస్థపడిపోతాను ఏం చెయ్యడం?

నా వళ్ళు చల్లబడిపోయింది ఇప్పుడు నాకు చలివేస్తుంది. బేగ్‌లో దుప్పటితీసి కప్పుకున్నాను నా పరిస్థితి చూసి ఆమె నవ్వుకుంటుందేమో అనుకున్నాను. మరో ఐదు నిమిషాల తరువాత ఆమె కూడా దుప్పటి కప్పుకుంది. ఆమెకుకూడా జ్వరం వచ్చిందా అనుకున్నాను. ఆమె కూడా నిస్పృహ ఫీలయిందేమో.

ఇంతలో రాజమండ్రి స్టేషన్ వచ్చింది ఆమె ఆమె బాడీగార్డు ముసలమ్మా బండి దిగి వెళ్ళిపోతున్నారు. కంపార్టుమెంటు తలుపు దగరకెళ్ళి నిలుచుండిపోయాను. వాళ్ళిద్దరూ స్టేషన్‌లో బైట మార్గం దగ్గరకు చేరుకున్నారు. ఆమె వెనక్కి తిరిగి చూసింది. నావైపు ఒక్క నిమిషం చూసి అటు తిరిగిపోయి బైటకి వెళ్ళిపోయింది. టిక్కెట్ కలెక్టర్‌కు రెండుటికెట్లు ఇచ్చేసి ముసలమ్మ కూడా ఆమెను అనుసరించింది.

* *

ఇరవై సంవత్సరాలు గడిచింది. జరిగిందంతా యథాతథంగా గుర్తుంది. ఆమె ఎవరో? ఆమె కళ్ళు, ఆ చూపులూ అలాగే జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కనిపిస్తాయి. ఆ జ్ఞాపకాలు తరచూ నన్ను వెంటాడుతుంటాయి ఆ క్షణం శాశ్వతమైపోయింది.

★